

www.siddipetpower.com

# సిద్దిపేట పవర్

తెలుగు దినపత్రిక

SIDDIPET POWER TELUGU DAILY



సంపుటి: 01 | సంచిక: 243 | హైదరాబాద్ | శుక్రవారం | 26-12-2025 | పేజీలు: 05 | ఎడిటర్ : తుక్కోజు గణేష్ బాబు


## కర్ణాటకలో ఘోర బస్సు ప్రమాదం

ప్రైవేట్ ట్రావెల్స్ స్లీపర్‌లో మంటలు

బస్సును లారీ ఢీకొనడంతో ఘటన

ఆరుగురి మృతి.. పలువురికి గాయాలు

ప్రమాద సమయంలో బస్సులో 33 మంది

ప్రధాని మోదీ, సీఎం సిద్ధరామయ్య విచారం

**బెంగళూరు, సిద్దిపేట పవర్:** క్రిస్మస్ పండుగ పూట కర్ణాటకలో ఘోర బస్సు ప్రమాదం జరిగింది. ప్రైవేట్ ట్రావెల్స్ స్లీపర్ బస్సును లారీ ఢీకొనడంతో మంటలు చెలరేగాయి. ఈ ఘటనలో ఆరుగురు చనిపోగా, ..మిగతా 2లో



## వాజ్‌పేయి ఆశయాలు కొనసాగిస్తాం

ఆయన నేతృత్వంలోనే దేశాభివృద్ధి

గతంలో ఒక్క కుటుంబం

పేరుతోనే పథకాలు

ఎన్డీయే హయాంలో

ఈ పరిస్థితిని మార్చేశాం

వాజ్‌పేయి, శ్యామప్రసాద్ ముఖర్జీ,

దీన్‌దయాళ్ ఆదర్శాలను అమలు చేస్తున్నాం

మేకిన్ ఇండియా లక్ష్యంగా

ముందుకు సాగుతున్నాం

లక్నోలో ప్రధానమంత్రి

నరేంద్ర మోదీ



**లక్నో, (సిద్దిపేట పవర్):** వాజ్‌పేయి ఆశయాలు కొనసాగిస్తామని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు. ఆయన నేతృత్వంలోనే దేశాభివృద్ధి జరిగిందని చెప్పారు. గతంలో ఒక్క కుటుంబం పేరుతోనే పథకాలు ఉండేవని విమర్శించారు. ఎన్డీయే హయాంలో ఈ పరిస్థితిని మార్చేశామన్నారు. వాజ్‌పేయి, శ్యామప్రసాద్ ముఖర్జీ, దీన్‌దయాళ్ ఆదర్శాలను అమలు చేస్తున్నామన్నారు. మేకిన్ ఇండియా లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని చెప్పారు. భారతరత్న అటల్ బిహారీ వాజ్‌పేయి ..మిగతా 2లో

## న్యూ ఇయర్ వేళ డ్రంక్ అండ్ డ్రైవ్

హైదరాబాద్ వ్యాప్తంగా ముమ్మరంగా తనిఖీలు

పబ్‌లు, రెస్టారెంట్లకు

పోలీసుల కీలక సూచనలు

ప్రజలు నిబంధనలు

పాటించాలని పోలీసుల ఆదేశాలు






# రేవంత్ రెడ్డి ఇప్పుడు ఎవరి తోలు తీస్తారు?

రేవంత్ నోటికొచ్చినట్టు వాగుతున్నారు

ప్రజలకు మాత్రం మేలు చేయడం లేదు

శపథాలు మాని పాలన మీద దృష్టి పెట్టాలి

కేసీఆర్ ఇచ్చిన పథకాలు మొత్తం బంద్ పెట్టారు

క్రిస్మస్ గిఫ్ట్ లు ఎందుకివ్వడం లేదు

ప్రభుత్వంపై ప్రజల్లో ఆగ్రహం పెరుగుతోందని వ్యాఖ్య

విద్యార్థుల పెండింగ్ బిల్లులు క్లియర్

చేయకపోతే ఉద్యమాలు తప్పవని హెచ్చరిక

మాజీ మంత్రి హరీశ్ రావు విమర్శ

**హైదరాబాద్, (సిద్దిపేట పవర్):** క్రిస్మస్ పర్వదినం సందర్భంగా బీఆర్ఎస్ సిద్దిపేట ఎమ్మెల్యే, మాజీ మంత్రి తన్నీరు హరీశ్ రావు గురువారం (డిసెంబర్ 25, 2025) సిద్దిపేట్ పట్టణంలోని సీఎస్ఐ చర్చిలో జరిగిన క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా క్రైస్తవ సోదర సోదరీమణులకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం క్రైస్తవుల సంక్షేమానికి ఎంతో కృషి చేసిందని హరీశ్ రావు పేర్కొన్నారు. క్రిస్మస్ సందర్భంగా రెండు రోజుల సెలవులు ఇచ్చామని, క్రిస్మస్ గిఫ్ట్ కిట్లు, బతుకమ్మ చీరలు, రంజాన్ తోఫా వంటి సంక్షేమ పథకాలు అందించామని గుర్తు చేశారు. మాజీ సీఎం కేసీఆర్ అన్ని మతాలను సమానంగా గౌరవించారని ప్రశంసించారు. అయితే, అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం క్రిస్మస్ గిఫ్ట్ కిట్లు ఎందుకు అందించడం లేదని ప్రశ్నించారు. ఇది క్రైస్తవ సమాజాన్ని ..మిగతా 2లో

## నేను ఎవరి బాణాన్ని కాదు.. ప్రజల గొంతుకను!

బీఆర్ఎస్‌లోకి మళ్లీ వెళ్లే ప్రసక్తే లేదన్న కవిత

2029లో స్వతంత్రంగానే

బరిలోకి దిగుతానని స్పష్టీకరణ

తనను కుట్రపూరితంగా పార్టీ నుంచి

బయటకు పంపారని ఆరోపణ

గత ప్రభుత్వ పాపంలో తనకూ

భాగముందంటూ క్షమాపణ






## ఫోన్ ట్యాపింగ్ కేసులో కీలక పరిణామం

ప్రభాకర్‌రావు కుమారుడి ఆర్థిక లావాదేవీలపై ఆరా

దక్కన్ కిచెన్ యజమాని నందకుమార్ విచారణ

నందకుమార్ ఇచ్చిన సమాచారంతో విచారణ వేగవంతం

**హైదరాబాద్, (సిద్దిపేట పవర్):** తెలంగాణలో సంచలనం రేపిన ఫోన్ ట్యాపింగ్ కేసులో స్పెషల్ ఇన్వెస్టిగేషన్ టీమ్ (SIT) విచారణ వేగంగా కొనసాగుతోంది. మాజీ SIB చీఫ్ ప్రభాకర్ రావు కస్టోడియల్ విచారణ డిసెంబర్ 25తో ముగియనున్న నేపథ్యంలో SIT అధికారులు ఆయన వాంగ్మూలాన్ని రికార్డు చేశారు. రెండు రోజుల క్రితం ప్రభాకర్ రావును, అదనపు SP ప్రణీత్ రావును ఉమ్మడిగా విచారించిన అధికారులు.. ప్రభాకర్ రావు కుమారుడు నిశాంత్ రావు ఆర్థిక లావాదేవీలపై ..మిగతా 2లో



## ఒడిశాలో భారీ ఎన్‌కౌంటర్

తెలంగాణకు చెందిన కీలక మావోయిస్టు నేత హతం

మావోయిస్టు సెంట్రల్ కమిటీ

సభ్యుడు గణేశ్ సహా ఆరుగురు మృతి

కందమాల్ జిల్లాలో భారీ ఆపరేషన్

గణేశ్ ఉయికేపై రూ.1.1 కోట్ల రివార్డు

02

## ఇది చారిత్రక విజయం


ఒడిశా ఎన్‌కౌంటర్‌లో ఆరుగురు మావోయిస్టుల మృతి

నక్సలిజం అంతానికి మరో కీలక అడుగు

మార్చి31 నాటికి నక్సలిజం నిర్మూలిస్తాం

ఆపరేషన్లు మరింత తీవ్రతరమవుతాయి

ఎన్ కౌంటర్‌పై కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా




## కేసీఆర్ కుటుంబం తెలంగాణకు శని

జగన్‌తో ఏం ఒప్పందం

జరిగిందో కేసీఆర్ చెప్పాలి

కాళేశ్వరం స్కామ్

నుంచి దృష్టి మళ్లిస్తున్నారు

అందుకే కేసీఆర్ కృష్ణా జలాల

గురించి మాట్లాడుతున్నారు

ముడుపుల కోసం

తెలంగాణను తాకట్టు పెట్టారు

రేవంత్ భాష ఆయన్నే నష్టపరుస్తుంది

కేంద్ర మంత్రి బండి సంజయ్



**హైదరాబాద్, (సిద్దిపేట పవర్):** కృష్ణా నదీ జలాల అంశంపై మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ చేస్తున్న వ్యాఖ్యలను కేంద్ర మంత్రి, బీజేపీ నేత బండి సంజయ్ తీవ్రంగా ఖండించారు. కాళేశ్వరం ప్రాజెక్టు స్కాం నుంచి ప్రజల దృష్టి మళ్లించేందుకే కేసీఆర్ ఇప్పుడు కృష్ణా జలాల విషయాన్ని తెరపైకి తీసుకొస్తున్నారని ఆయన ..మిగతా 3లో




## చిల్లర మాటలు బంద్ చేయాలి

రాజకీయాల్లో తిట్ల పురాణాన్ని

ప్రారంభించిందే కేసీఆర్ అన్న చామల

ముఖ్యమంత్రిని ఉద్దేశించి కేసీఆర్ 'తోలు

తీస్తా' అంటే ఊరుకునేది లేదని హెచ్చరిక

కేసీఆర్ పద్ధతిగా మాట్లాడితే

రేవంత్ రెడ్డి అంతే పద్ధతిగా

సమాధానం చెబుతారని వ్యాఖ్య

# నేను ఎవరి బాణాన్ని కాదు.. ప్రజల గొంతుకను!

- బీఆర్ఎస్‌లోకి మళ్లీ వెళ్లే ప్రసక్తే లేదన్న కవిత
- 2029లో స్వతంత్రంగానే బరిలోకి దిగుతానని స్పష్టీకరణ
- తనను కుట్రపూరితంగా పార్టీ నుంచి బయటకు పంపారని ఆరోపణ
- గత ప్రభుత్వ పాపంలో తనకూ భాగముందంటూ క్షమాపణ

**హైదరాబాద్, (సిద్దిపేట పవర్):**

"నేను ఎవరో వదిలిన బాణాన్ని కాదు.. తెలంగాణ గడ్డపై ప్రజల కోసం ఎక్కుపెట్టిన బాణాన్ని" అని జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత స్పష్టం చేశారు. రాజకీయాల్లో తన పంథా ఇకపై ప్రజల పక్షమేనని, పోరాటంలో వెనక్కి తగ్గేది లేదని ఆమె తేల్చి చెప్పారు. బుధవారం భువనగిరిలో 'జనంబాట' కార్యక్రమంలో భాగంగా ఆమె మీడియాతో మాట్లాడారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ పాలనపై వస్తున్న విమర్శలపై కవిత స్పందిస్తూ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. "గత ప్రభుత్వంలో నేను ఎప్పుడూ కీలక పాత్రలో లేను. కుట్రపూరితంగా నన్ను కేవలం నిజామాబాద్‌కే పరిమితం చేశారు. అయితే, ఆ సమయంలో పార్టీలో ఉన్నాను కాబట్టి, ప్రభుత్వ తప్పులకు నేను కూడా బాధ్యురాలినే. ఆ పాపంలో నాకూ భాగముంది. అందుకే ప్రజలను బేషరతుగా క్షమాపణలు కోరుతున్నాను" అని ఆమె పేర్కొన్నారు.

తన భవిష్యత్ రాజకీయ ప్రణాళికను కవిత ఈ సందర్భంగా బయటపెట్టారు. తిరిగి బీఆర్ఎస్‌లో చేరే ప్రసక్తి అస్సలు లేదని స్పష్టం చేశారు. ప్రస్తుతం మధ్యలో జరిగే ఎలాంటి ఉప ఎన్నికల్లోనూ, ఇతర పోటీల్లోనూ తాను పాల్గొనబోనని చెప్పారు. నేరుగా 2029 అసెంబ్లీ ఎన్నికల్లోనే స్వతంత్ర అభ్యర్థిగా బరిలోకి దిగుతానని ప్రకటించారు. ఎలాంటి కారణం చెప్పకుండానే తనను బీఆర్ఎస్ నుంచి సస్పెండ్ చేయడంపై ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. "కారణం లేకుండా సస్పెండ్ చేయడం బాధ కలిగించింది. కానీ నా ఆత్మగౌరవం ముఖ్యం. దానిపై రాజీపడను. అందుకే ప్రజల కష్టసుఖాలు తెలుసుకోవడానికి 'జనంబాట' పట్టాను. జాగృతి అనేది కేవలం పార్టీ విభేదాల వల్ల పుట్టింది కాదు.. 19 ఏళ్ల కిందటే తెలంగాణ భాష, సంస్కృతి కోసం ఏర్పడిన సంస్థ" అని గుర్తుచేశారు.




## ఫోన్ ట్యాపింగ్ కేసులో కీలక పరిణామం

**మొదటిపేజీ తరువాయి**



కూడా ప్రశ్నలు సంధించారు. అదనంగా, మాజీ టాస్క్ ఫోర్స్ అధికారి రాధాకిషన్ రావు, DSP తిరుపతన్న, ఇన్‌స్పెక్టర్ శ్రవణ్ కుమార్ రావును కూడా SIT అధికారులు విచారిస్తున్నారు. ఈ ముగ్గురినీ రిమాండ్‌లోకి తీసుకుని వివరాలు సేకరిస్తున్నట్టు సమాచారం.

**దక్కన్ కిచెన్ యజమాని నందకుమార్ విచారణ**

ఫోన్ ట్యాపింగ్ కేసులో మరో కీలక వ్యక్తి దక్కన్ కిచెన్ యజమాని నందకుమార్‌ను కూడా SIT అధికారులు విచారించారు. గతంలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేల కొనుగోలు కేసులో నందకుమార్ అరెస్టు అయిన విషయం తెలిసిందే. ఫోన్ ట్యాపింగ్ ద్వారా ఎమ్మెల్యేల కొనుగోలు అంశం బయటపడటంతో.. నందకుమార్ వాంగ్మూలాన్ని SIT రికార్డు చేసింది. ఈ విచారణలో నందకుమార్ కీలక సమాచారం అందించినట్టు సమాచారం.

గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో SIB అధికారులు ప్రతిపక్ష నేతలు, వ్యాపారవేత్తలు, ఇతరుల ఫోన్లను అక్రమంగా ట్యాప్ చేసినట్టు ఆరోపణలు రావడంతో ఈ కేసు రిజిస్టర్ అయింది. పంజాగుట్ట పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. ప్రభాకర్ రావు, ప్రణీత్ రావు ప్రధాన నిందితులుగా ఉన్నారు. దర్యాప్తులో ఎమ్మెల్యేల కొనుగోలు, ఆర్థిక లావాదేవీలు వంటి కోణాలు కూడా తెరపైకి వచ్చాయి. సిట్ అధికారులు మరిన్ని కీలక వ్యక్తులను విచారించే అవకాశం ఉంది. కేసు దర్యాప్తు మరింత లోతుగా సాగుతోందని అధికార వర్గాలు తెలిపాయి.

# రేవంత్ రెడ్డి ఇప్పుడు ఎవరి తోలు తీస్తారు?

**మొదటిపేజీ తరువాయి**

నిర్లక్ష్యం చేస్తున్నట్లు ఉందని విమర్శించారు. వేడుకల అనంతరం మీడియాతో మాట్లాడిన హరీశ్ రావు, ప్రతి సంవత్సరం ఆనవాయితీగా సిద్దిపేట్ చర్చిలో క్రిస్మస్ వేడుకల్లో పాల్గొంటున్నానని తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా క్రైస్తవులు ఈ పండుగను ఘనంగా జరుపుకుంటున్నారని, ఏసుక్రీస్తు ప్రపంచానికి ఇచ్చిన మంచి సందేశాన్ని గుర్తు చేశారు.

అనంతరం పట్టణంలోని నాసార్‌పూర్ అర్బన్ రెసిడెన్షియల్ స్కూల్‌లో దుప్పట్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. విద్యార్థులకు అందిస్తున్న గుడ్లు, బియ్యం నాణ్యతను పరిశీలించారు. చలికాలంలో విద్యార్థులు ఇబ్బంది పడకుండా దుప్పట్లు పంపిణీ చేశారు. విద్యార్థుల సమస్యలు అడిగి తెలుసుకుని, వారితో కలిసి భోజనం చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వంపై హరీశ్ రావు మండిపడ్డారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం నాణ్యమైన బియ్యం అందించిందని, ఇప్పుడు కొత్త బియ్యం ఇస్తున్నా అన్నం మెత్తగా ముద్దలుగా అవుతోందని విద్యార్థులు చెప్పారని పేర్కొన్నారు. అయితే, ఐదు నెలల నుంచి విద్యార్థులకు కాస్మెటిక్ చార్జీలు, మెస్ బిల్లులు రావడం లేదని ఆరోపించారు. "గ్రీన్ చానల్ ద్వారా డబ్బులు ఇస్తామని చెప్పిన రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఎందుకు ఇవ్వడం లేదు? 20 శాతం కమీషన్ ఇచ్చే వారికి మాత్రమే డబ్బులు విడుదల చేస్తున్నారా?" అని ప్రశ్నించారు. పెండింగ్ బిల్లులు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఉద్దేశించి హరీశ్ రావు తీవ్ర విమర్శలు గుప్పించారు. "చిల్లర మాటలు మాని పెండింగ్ బిల్లులు విడుదల చేయండి. విద్యాశాఖ మీ దగ్గరే ఉండి కూడా అనాథ పిల్లలకు అన్నం పెట్టడం లేదు. మళ్లీ గెలుస్తానని శపథాలు చేస్తున్నారు కానీ కమీషన్లు కొట్టడం, పార్టీలు మారడం, సీట్లు కొనడమే మీకు అలవాటు" అని సెటైర్లు వేశారు. తెలంగాణ పోరాట యోధుడు కేసీఆర్ అని ప్రశంసిస్తూ, కేసీఆర్ లేకుండా తెలంగాణ లేదని చెప్పారు. ఫార్మసిటీని తాము ఏర్పాటు చేస్తే రేవంత్ ఖండించారు, ఇప్పుడు రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నారని ఆరోపించారు. "వీధి రౌడీలా మాట్లాడుతున్నారు" అని ఎద్దేవా చేశారు. ఈ కార్యక్రమాల ద్వారా హరీశ్ రావు క్రైస్తవ సమాజం, విద్యార్థుల సంక్షేమంపై ఆదర్శం చూపిస్తూనే, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను బహిర్గతం చేశారు.



# ఒడిశాలో భారీ ఎన్‌కౌంటర్

- తెలంగాణకు చెందిన కీలక మావోయిస్టు నేత హతం
- మావోయిస్టు సెంట్రల్ కమిటీ సభ్యుడు గణేశ్ సహా ఆరుగురు మృతి
- కందమాల్ జిల్లాలో భారీ ఆపరేషన్
- గణేశ్ ఉయికేపై రూ.1.1 కోట్ల రివార్డు

**ఒడిశా, (సిద్దిపేట పవర్):**

ఒడిశా రాష్ట్రం కందమాల్ జిల్లా అటవీ ప్రాంతాల్లో భద్రతా బలగాలు, మావోయిస్టుల మధ్య జరిగిన రెండు రోజుల ఎదురుకాల్పుల్లో మావోయిస్టు సెంట్రల్ కమిటీ సభ్యుడు, ఒడిశా ఇన్‌చార్జ్ గణేశ్ ఉయికే (అలియాస్ పాకా హనుమంతు, రాజేష్ తివారీ, చాము, రూపా) సహా మొత్తం ఆరుగురు మావోయిస్టులు మృతి చెందారు. డిసెంబర్ 24 (బుధవారం) నుంచి 25 (గురువారం) వరకు కందమాల్ జిల్లాలోని గుమ్మా, చకపాడ్ పోలీస్ స్టేషన్ పరిధి అటవీ ప్రాంతాల్లో ఈ ఎన్‌కౌంటర్లు జరిగాయి.

ఇంటెలిజెన్స్ ఇన్‌పుట్‌ల ఆధారంగా ఒడిశా పోలీసుల స్పెషల్ ఆపరేషన్స్ గ్రూప్ (SOG), CRPF, BSF బృందాలు సంయుక్తంగా నిర్వహించిన ఈ ఆపరేషన్‌లో 23 టీమ్‌లు పాల్గొన్నాయి. గురువారం ఉదయం చకపాడ్ పోలీస్ స్టేషన్ పరిధిలోని రంపా అటవీ ప్రాంతంలో జరిగిన ఎదురుకాల్పుల్లో గణేశ్ ఉయికే సహా నలుగురు (ఇద్దరు పురుషులు, ఇద్దరు మహిళలు) మావోయిస్టులు మృతి చెందారు. ఘటనాస్థలం నుంచి రెండు ఇన్‌సాస్ రైఫిళ్లు, ఒక .303 రైఫిల్ సహా ఆయుధాలు స్వాధీనం చేసుకున్నారు. మిగతా ముగ్గురి గుర్తింపు కొనసాగుతోంది.

గణేశ్ ఉయికే (69 ఏళ్లు)పై రూ.1.1 కోట్ల రివార్డు ఉంది. ఆయన తెలంగాణలోని నల్గొండ జిల్లా చందూరు మండలం పుల్లెంల (పుల్లెమల) గ్రామానికి చెందినవాడు. ఒడిశా మావోయిస్టు కార్యకలాపాలకు ప్రధాన నేతగా, దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీలో కీలక పాత్ర పోషించారు.

కేంద్ర హోం మంత్రి అమిత్ షా ఈ ఆపరేషన్‌ను "మేజర్ బ్రేక్‌త్రూ"గా అభివర్ణించారు. "ఒడిశా నక్సలిజం రహిత రాష్ట్రంగా మారే దిశగా ఉంది. మార్చి 31, 2026లోపు దేశం నుంచి నక్సలిజాన్ని పూర్తిగా నిర్మూలిస్తాం" అని పేర్కొన్నారు. ఒడిశా డీజీపీ యోగేష్ బహదూర్ ఖురానియా "మావోయిస్టుల బ్యాక్‌బోన్ బ్రేక్ అయింది" అని అన్నారు.

**గణేశ్ ఉయికే నేపథ్యం:**

పాక చంద్రయ్య, పాపమ్మ దంపతుల ఆరుగురు సంతానంలో మొదటివాడు గణేశ్. 1961లో జన్మించారు. ముగ్గురు చెల్లెళ్లు, ఇద్దరు తమ్ముళ్లు ఉన్నారు. చందూరులో పదో తరగతి, ఇంటర్, డిగ్రీ నల్గొండలో పూర్తి చేశారు. చదువు రోజుల్లోనే రాడికల్ స్టూడెంట్ యూనియన్‌లలో చురుకుగా పనిచేశారు. ఆయన తండ్రి సీపీఎం పార్టీలో సభ్యుడు కావడంతో చిన్నప్పటి నుంచే కమ్యూనిస్టు భావజాలం ప్రభావితమయ్యారు.

45 ఏళ్ల క్రితం ఏచూరి శ్రీనివాస్ హత్య కేసులో కీలక పాత్ర పోషించినట్టు ఆరోపణలు ఉన్నాయి. అనంతరం అజ్ఞాతంలోకి వెళ్లి నక్సలైట్ ఉద్యమంలో చేరారు. మండల కమిటీ నుంచి జిల్లా, రాష్ట్రస్థాయి నేతగా ఎదిగి, మూడు రాష్ట్రాలకు కేంద్ర కమిటీ సభ్యుడిగా పనిచేశారు. తల్లిదండ్రులు చనిపోయినప్పుడు కూడా ఇంటికి రాలేదు. ఇటీవల ఆరోగ్య సమస్యలతో ఇబ్బంది పడుతున్నట్టు సమాచారం. ఈ ఎన్‌కౌంటర్ ఒడిశాలో మావోయిస్టు కార్యకలాపాలకు భారీ ఎదురుదెబ్బగా అధికారులు అభివర్ణిస్తున్నారు. గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి.



# కర్ణాటకలో ఘోర బస్సు ప్రమాదం

**మొదటిపేజీ తరువాయి**

పలువురు గాయపడ్డారు. బస్సు బెంగళూరు నుంచి గోకర్ణ వెళ్తుండగా చిత్రదుర్గ జిల్లా గోర్లతు గ్రామ సమీపంలో ప్రమాదానికి గురైంది. ఘటనలో బస్సు, లారీ పూర్తిగా దగ్ధమయ్యాయి. హిరియూర్ నుంచి బెంగళూరు వెళ్తున్న లారీ అదుపుతప్పి రోడ్డుకు అటువైపు వెళ్తున్న ట్రావెల్స్ బస్సును ఢీ కొనడంతోనే ప్రమాదానికి కారణమైందని అధికారులు తెలిపారు.

**క్షతగాత్రులను ఆసుపత్రికి తరలింపు**

విషయం తెలిసిన వెంటనే పోలీసులు, ఫైర్ సిబ్బంది స్పాట్‌కు చేరుకున్నారు. మంటలను అదుపు చేశారు. గాయపడ్డ వారిని ఆసుపత్రికి తరలించారు. ప్రమాద సమయంలో ప్రయాణికులు గాఢ నిద్రలో ఉన్నారు. మంటలు చెలరేగగానే కొందరు బస్సు అద్దాలు పగులగొట్టి ప్రాణాలు దక్కించుకున్నారు. గురువారం ఉదయం 2 గంటల తర్వాత ప్రమాదం జరిగినట్టు పోలీసులు తెలిపారు.

**ప్రధాని, సీఎం సంతాపం**

బస్సు ప్రమాదంపై ప్రధాని మోదీ స్పందించారు. చనిపోయిన వారి కుటుంబాలకు సానుభూతి తెలియజేశారు. గాయపడినవారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. పీఎంఎన్ఆర్ఎఫ్ నుంచి మృతుల కుటుంబాలకు రూ.2 లక్షల పరిహారం ప్రకటించారు. గాయపడిన వారికి రూ.50 వేలు ఇస్తామన్నారు. సీఎం సిద్ధరామయ్య స్పందిస్తూ, మృతుల కుటుంబాలకు అండగా ఉంటామన్నారు. రూ.2 లక్షలు అందిస్తామని తెలిపారు. గాయపడిన వారికి కూడా పరిహారం ప్రకటించారు.



# ఇది చారిత్రక విజయం

- ఒడిశా ఎన్‌కౌంటర్‌లో ఆరుగురు మావోయిస్టుల మృతి
- నక్సలిజం అంతానికి మరో కీలక అడుగు
- మార్చి31 నాటికి నక్సలిజం నిర్మూలిస్తాం
- ఆపరేషన్లు మరింత తీవ్రతరమవుతాయి
- కంధమాల్ ఎన్ కౌంటర్‌పై కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా

**ఒడిశా, (సిద్దిపేట పవర్):**

దేశంలో మావోయిస్టు కార్యకలాపాలపై కేంద్ర ప్రభుత్వం మరింత దూకుడు పెంచింది. ఒడిశాలోని కంధమాల్ జిల్లా గుమ్మా అటవీ ప్రాంతంలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఆరుగురు మావోయిస్టులు మృతి చెందారు. ఈ ఘటనపై కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా స్పందిస్తూ.. ఇది నక్సలిజం అంతానికి మరో కీలక అడుగు అని వ్యాఖ్యానించారు. 2026 నాటికి దేశం మొత్తాన్ని నక్సలిజం నుంచి పూర్తిగా విముక్తం చేస్తామని తెలిపారు. ఒడిశాను మావోయిస్టు రహిత రాష్ట్రంగా మార్చడమే లక్ష్యమని చెప్పారు. భద్రతా బలగాల ఆపరేషన్లు మరింత తీవ్రతరం అవుతాయని స్పష్టం చేశారు. ఈ ఉదయం కంధమాల్ జిల్లాలోని గుమ్మా అటవీ ప్రాంతంలో మావోయిస్టులు సంచరిస్తున్నారన్న నమ్మకమైన సమాచారం భద్రతా బలగాలకు అందింది. వెంటనే అప్రమత్తమైన పోలీసులు, ప్రత్యేక బలగాలు ఆ ప్రాంతంలో కూంబింగ్ ఆపరేషన్ చేపట్టాయి. ఈ సమయంలో మావోయిస్టులు కాల్పులకు దిగడంతో రెండు వర్గాల మధ్య భీకర ఎదురు కాల్పులు జరిగాయి. కొంతసేపు కొనసాగిన కాల్పుల్లో ఆరుగురు మావోయిస్టులు అక్కడికక్కడే మృతి చెందారు. ఎన్‌కౌంటర్ అనంతరం ఆ ప్రాంతం నుంచి భారీగా ఆయుధాలు, బుల్లెట్లు, పేలుడు పదార్థాలు స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు వెల్లడించారు. ఈ ఎన్‌కౌంటర్‌లో హతమైన వారిలో మావోయిస్టు ఉద్యమంలో అత్యంత కీలక నేతగా గుర్తింపు పొందిన పాక హనుమంతు అలియాస్ గణేశ్ కూడా ఉన్నట్లు కేంద్ర ప్రభుత్వం, ఒడిశా ప్రభుత్వం అధికారికంగా ప్రకటించాయి. గణేశ్ స్వస్థలం తెలంగాణలోని నల్గొండ జిల్లా చండూర్. ఆయనపై రూ.1.10 కోట్ల రివార్డు ఉంది. దాదాపు 40 ఏళ్లుగా మావోయిస్టు ఉద్యమంలో కొనసాగుతూ, వివిధ కీలక హోదాల్లో పనిచేశారు. మావోయిస్టు సంస్థాగత విస్తరణలో గణేశ్ కీలక పాత్ర పోషించారని భద్రతా వర్గాలు చెబుతున్నాయి.



# వాజ్‌పేయి ఆశయాలు కొనసాగిస్తాం

**మొదటిపేజీ తరువాయి**

101వ జయంతి (డిసెంబర్ 25, 2025) సందర్భంగా ఉత్తరప్రదేశ్ రాజధాని లక్నోలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ గురువారం మధ్యాహ్నం రాష్ట్రీయ ప్రేరణా స్థల్‌ను జాతికి అంకితం చేశారు. గోమ్తీ నది ఒడ్డున 65 ఎకరాల విస్తీర్ణంలో రూ.230 కోట్ల ఖర్చుతో నిర్మించిన ఈ జాతీయ స్మారక సముదాయంలో అటల్ బిహారీ వాజ్‌పేయి, డాక్టర్ శ్యామప్రసాద్ ముఖర్జీ, పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయల 65 అడుగుల ఎత్తైన కాంస్య విగ్రహాలు ప్రధాన ఆకర్షణగా నిలుస్తాయి. ఈ ముగ్గురు బీజేపీ ఆదర్శవాదుల ఆదర్శాలు, జీవితాలను ప్రతిబింబించేలా రూపొందిన ఈ స్థలం భవిష్యత్ తరాలకు ప్రేరణా కేంద్రంగా మారనుంది.

కార్యక్రమంలో రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్, గవర్నర్ ఆనందీబెన్ పటేల్ తదితరులు పాల్గొన్నారు. ప్రారంభోత్సవం అనంతరం బహిరంగ సభలో మాట్లాడిన ప్రధాని మోదీ, ఆర్టికల్ 370 రద్దును ప్రస్తావిస్తూ "బీజేపీకి గర్వకారణం మా ప్రభుత్వానికి ఆర్టికల్ 370 అనే గోడను కూల్చివేసే అవకాశం దక్కడం. శ్యామప్రసాద్ ముఖర్జీ కలను సాకారం చేశాం. జమ్మూకాశ్మీర్‌లో భారత రాజ్యాంగాన్ని పూర్తిగా అమలు చేశాం" అని పేర్కొన్నారు.

**మోదీ మాట్లాడుతూ:**

కోట్లాది మందిని పేదరికం నుంచి బయటపడేశాం; గతంలో ఒకే కుటుంబం పేరుతో పథకాలు అమలయ్యేవి. వాజ్‌పేయి హయాంలోనే గ్రామీణ రోడ్లు, ఢిల్లీ మెట్రోకు బీజం పడింది; 2014 నుంచి 4 లక్షల కి.మీ. రోడ్లు నిర్మించాం. భవిష్యత్తులో భారత్ అతిపెద్ద మొబైల్ ఫోన్ ఉత్పత్తి దేశంగా మారనుంది; మొబైల్, ఇంటర్నెట్ వినియోగంలో అగ్రస్థానం. లక్నోలో అతిపెద్ద డిఫెన్స్ కారిడార్; బ్రహ్మోస్ క్షిపణులు ఇక్కడే తయారవుతున్నాయి - ప్రపంచం వాటి సామర్థ్యం చూసింది. డిసెంబర్ 25న అటల్ జయంతితో పాటు మదన్ మోహన్ మాలవీయ జయంతి కూడా కావడాన్ని గుర్తు చేస్తూ ఇద్దరు భారతరత్నలకు నివాళులర్పించారు. అందరి కృషితోనే వికసిత భారత్ సాకారమవుతుందని, సుపరిపాలన దినంగా ఈ రోజును జరుపుకోవాలని పిలుపునిచ్చారు. ఈ స్మారక సముదాయంలో లోటస్ ఆకారంలో రెండు అంతస్తుల మ్యూజియం కూడా ఉంది, ఇందులో భారత జాతీయ ప్రయాణం, నాయకత్వ వారసత్వాన్ని ప్రదర్శిస్తారు. ఈ కార్యక్రమం ద్వారా బీజేపీ ఆదర్శాలు, దేశాభివృద్ధి సందేశాన్ని మోదీ మరోసారి బలపరిచారు.





# న్యూ ఇయర్ వేళ డ్రంక్ అండ్ డ్రైవ్

- **హైదరాబాద్ వ్యాప్తంగా ముమ్మరంగా తనిఖీలు**
- **పబ్‌లు, రెస్టారెంట్లకు పోలీసుల కీలక సూచనలు**
- **ప్రజలు నిబంధనలు పాటించాలని పోలీసుల ఆదేశాలు**

**హైదరాబాద్, (సిద్దిపేట పవర్):**

నూతన సంవత్సర వేడుకల సందర్భంగా రోడ్లపై శాంతిభద్రతలు కాపాడేందుకు, ప్రమాదాలను నివారించేందుకు హైదరాబాద్ సిటీ పోలీసులు పటిష్ఠ చర్యలు చేపట్టారు. ముఖ్యంగా మద్యం మత్తులో వాహనాలు నడిపే (డ్రంక్ అండ్ డ్రైవ్) వారిపై జీరో టాలరెన్స్ విధానం అమలు చేస్తున్నారు. హైదరాబాద్ పోలీస్ కమిషనర్ వీ.సీ. సజ్జనార్ ఆధ్వర్యంలో డిసెంబర్ 24వ తేదీ (బుధవారం) నుంచి డిసెంబర్ 31వ తేదీ వరకు నగరవ్యాప్తంగా ప్రత్యేక డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు కొనసాగనున్నాయి.

తొలి రోజు (డిసెంబర్ 24)నే నగరంలోని వివిధ ప్రాంతాల్లో ముమ్మర తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో మద్యం మత్తులో వాహనాలు నడుపుతూ పట్టుబడిన 304 మంది మోటారిస్టులను అదుపులోకి తీసుకున్నారు. వీరిలో ఒక మైనర్ (చట్టపరమైన వయస్సు లేనివాడు) కూడా ఉన్నాడు. నిబంధనలు ఉల్లంఘించిన 304 వాహనాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ చర్యలు నగరవ్యాప్తంగా సుమారు 120 ప్రాంతాల్లో జరుగుతున్నాయి. ముఖ్యంగా డిసెంబర్ 31 రాత్రి 100 నుంచి 120 చోట్ల అదనపు బలగాలతో (సుమారు 7 ప్లాటూన్లు) తనిఖీలు మరింత బలోపేతం చేయనున్నారు. కమిషనర్ వీ.సీ. సజ్జనార్ మద్యం సేవించి వాహనాలు నడిపే వారిపై కఠిన హెచ్చరిక జారీ చేశారు. "జీరో టాలరెన్స్ విధానం అమలవుతుంది. డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడితే వాహనం సీజ్ చేయడమే కాకుండా, రూ.10,000 జరిమానా, ఆరు నెలల వరకు జైలు శిక్ష, అవసరమైతే డ్రైవింగ్ లైసెన్స్ శాశ్వతంగా రద్దు చేస్తాం" అని ఆయన స్పష్టం చేశారు. రాష్ డ్రైవింగ్, రేసింగ్, స్టంట్లు చేసే వారిపైనా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. న్యూ ఇయర్ సెలబ్రేషన్స్ కోసం పబ్‌లు, హోటల్స్‌కు వెళ్లే వారికి కమిషనర్ ప్రత్యేక సూచనలు చేశారు తప్పనిసరిగా డ్రైవర్‌ను వెంట తీసుకెళ్లండి లేదా క్యాబ్ బుక్ చేసుకోండి. మద్యం సేవించిన తర్వాత స్వయంగా వాహనం నడపకండి. సామాన్య ప్రజలకు ఇబ్బంది కలగకుండా బాధ్యతాయుతంగా వేడుకలు జరుపుకోండి. అదనంగా, న్యూ ఇయర్ ఈవ్ (డిసెంబర్ 31 రాత్రి) పార్టీలు మరియు ఈవెంట్స్ అర్ధరాత్రి 1 గంట వరకు మాత్రమే అనుమతి ఉంటుంది. శబ్ద కాలుష్య నిబంధనలు ఉల్లంఘిస్తే సౌండ్ సిస్టమ్స్ సీజ్ చేస్తామని పోలీసులు హెచ్చరించారు. మహిళల భద్రత కోసం షీ టీమ్స్‌ను ప్లైన్ క్లోత్స్‌లో డిప్లాయ్ చేశారు.

ఈ చర్యల ద్వారా నగరంలో రోడ్డు ప్రమాదాలను తగ్గించి, సురక్షితమైన వేడుకలు జరిగేలా చూడాలనేది పోలీసుల లక్ష్యం. ప్రజలు సహకరించి, నిబంధనలు పాటించాలని కమిషనర్ సజ్జనార్ కోరారు.

## నవాబ్ బహదూర్ యార్ జంగ్ వర్ధంతి వేడుకలకు హాజరైన గులాం అహ్మద్

**కరీంనగర్, డిసెంబర్ 25(సిద్దిపేట పవర్);**

ఏఐఎంఐఎం వ్యవస్థాపక అధ్యక్షుడు ఖాయిదేఈమిల్లత్ నవాబ్ బహదూర్ యార్ జంగ్ 82వ వర్ధంతి సందర్భంగా హైదరాబాద్ ఎంఐఎం పార్టీ జాతీయ ప్రధాన కార్యాలయం దారుస్సలాంలో నిర్వహించిన ఖురాన్ ఖానీ ఆధ్యాత్మిక కార్యక్రమానికి ఎంఐఎం కరీంనగర్ అధ్యక్షుడు సయ్యద్ గులాం అహ్మద్ హుస్సేన్ గురువారం హాజరయ్యారు. ఈ సందర్భంగా గులాం అహ్మద్ హుస్సేన్ మాట్లాడుతూ..ముస్లింల రాజకీయ అభివృద్ధి కోసం నవాబ్ బహద్దూర్ యార్ జంగ్ ఆనాడు గ్రహించి ఎంఐఎం పార్టీని స్థాపించారని చెప్పారు. ఆనాడు ఉన్నత లక్ష్యంతో స్థాపించిన ఎంఐఎం పార్టీ నేడు ఇంతింతై వటుడింతై బారిష్టర్ అసదుద్దీన్ ఓవైసీ అక్బరుద్దీన్ వైసీల నాయకత్వంలో దేశవ్యాప్తంగా విస్తరించిందని పేర్కొన్నారు. పీడిత తాడిత వర్గాల కోసం దళితులు ముస్లింల అభ్యున్నతి కోసం ఎంఐఎం పార్టీ ఆవిర్భవించిందని చెప్పారు. తెలంగాణ రాష్ట్రంలోనే కాక దేశవ్యాప్తంగా ఎంఐఎం పార్టీ బలోపేతం అయిందన్నారు. రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా, కార్పొరేషన్ పై ఎంఐఎం జెండా ఎగరవేసేందుకు ఎంఐఎం పార్టీ విశేషంగా కృషి చేస్తుందన్నారు.



## అక్రమ ఇసుక రవాణా చేస్తున్న ట్రాక్టర్ల పట్టివేత

**కరీంనగర్ రూరల్, డిసెంబర్ 25(సిద్దిపేట పవర్):**

గ్రామాల్లో పోలీసులు పెట్రోలింగ్ నిర్వహిస్తున్న క్రమంలో సుల్తానాబాద్ మండలం గొల్లపల్లి గ్రామానికి చెందిన సుదగోని భరద్వాజ్ తండ్రి నర్సయ్య అనే వ్యక్తి అక్రమంగా ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుకను రవాణా చేస్తుండగా చామనపల్లి గ్రామ శివారు వద్ద కరీంనగర్ రూరల్ పోలీసులు పట్టుకున్నారు. మరియు బొమ్మకల్ గ్రామానికి చెందిన పోగుల సాయిచంద్ తండ్రి ఆంజనేయులు అనునతడు అక్రమంగా ఇసుక రవాణా చేస్తుండగా బొమ్మకల్ గ్రామం లోని లారీ అసోసియేషన్ వద్ద రూరల్ పోలీసులు పట్టుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసి ట్రాక్టర్ ను సీజ్ చేసి తదుపరి చర్య నిమిత్తం కోర్టుకు పంపనైనది మరియు అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక రవాణా చేస్తే వారిపై కఠిన చర్యలు ఉంటాయని కరీంనగర్ రూరల్ సీఐ ఏ. నిరంజన్ రెడ్డి హెచ్చరించాడు.




# 27 ఎస్ఎఫ్ఎస్ స్కూల్లో 100 అడుగుల జాతీయ జెండా ఆవిష్కరణ

- **10 మంది జాతీయ, అంతర్జాతీయ క్రీడాకారులకు సత్కారం**
- **తెలుగు రాష్ట్రాల క్రీడా సాంస్కృతిక పోటీలు ఎస్ఎఫ్ఎస్ స్కూలు ప్రిన్సిపాల్ రెవరెండ్ ఫాదర్ మనోజ్**

**సీతమ్మధార, డిసెంబర్ 25(సిద్దిపేట పవర్):**

వందేమాతర గీతం 150 వసంతోత్సవాలు సందర్భంగా ఈ నెల 27వ తేదీన ఉదయం 9 గంటలకు సీతమ్మధార ఎస్ఎఫ్ఎస్ స్కూల్లో 100 అడుగుల ఎత్తు గల జాతీయ పతాకాన్ని ఆవిష్కరిస్తున్నామని స్కూల్ ప్రిన్సిపల్ రెవరెండ్ ఫాదర్ మనోజ్ పేర్కొన్నారు. ఫ్లాగ్ కోడ్ ఆఫ్ ఇండియా 20002 నియమావళిని అనుసరిస్తూ 100% పాలిష్టరు 30 20 సైజు క్లాతు 160 జిఎస్ఎం నాణ్యతతో ఉత్తర ప్రదేశ్ లోని షామిలి జిల్లాలో ఈ జాతీయ పతాకాన్ని తయారు చేయించామన్నారు. దీనిని స్కూలు ప్రాంగణంలో సాంకేతికంగా ఏర్పాటు చేయడం కోసం ఉత్తర ప్రదేశ్ నుంచి ఉస్మానిల్లాబి సారథ్యంలో ప్రత్యేక నిపుణుల బృందాన్ని తీసుకువచ్చామన్నారు. పాఠశాలల చరిత్రలో ప్రతిష్టాత్మకంగా భావించే ఈ 100 అడుగుల జాతీయ పతాకాన్ని విశాఖకు చెందిన జాతీయ అంతర్జాతీయ క్రీడాకారులు, తెలుగు రాష్ట్రాలకు చెందిన ఎస్ఎఫ్ఎస్ స్కూల్స్ ప్రతిభావంతులైన క్రీడా, కళాకారుల సమక్షంలో విశాఖలోని ఆర్చ్ బిషప్ మోస్ట్ రెవరెండ్ డాక్టర్ ఉడుమల బాల, ఎస్ఎఫ్ఎస్ స్కూల్స్ జనరల్ మేనేజర్ రెవరెండ్ ఫాదర్ బి. సురేష్ బాబు,ఎస్ఎఫ్ఎస్ స్కూల్ కరస్పాండెంట్ రెవరెండ్ ఫాదర్ జోసెఫ్, జాతీయ జర్నలిస్టుల సంఘం కార్యదర్శి గంట్ల శ్రీనుబాబులు ఆవిష్కరిస్తారన్నారు. ఈ ఎత్తయిన జాతీయ పతాకావిష్కరణ కార్యక్రమం 11వ ఎంఎస్ఎఫ్ఎస్. క్రీడా సాంస్కృతిక పోటీల గౌరవజ్ఞాపికగా నిలుస్తుందని మనోజ్ ఆనందాన్ని వ్యక్తం చేశారు.

**పదిమందికి సత్కారం**

ఈ సందర్భంగా విశాఖ నుంచి జాతీయ, అంతర్జాతీయ క్రీడా పోటీల్లో ప్రతిభ కనబరిచిన డాక్టర్ పల్లి మాధురి( అథ్లెటిక్స్) కే. శ్రీనివాస్ చక్రవర్తి (ఖో ఖో ) పి. కరుణకుమారి (ఇండియా అంధుల క్రికెటర్) శ్రీప్రద పోచన పెద్ది (బాస్కెట్ బాల్ )ఆర్. హాసిని (లాన్ టెన్నిస్ )ఆకుల సాయి సంహిత ( స్కేటింగ్ )ఎన్. తేజ, బి. శశికుమార్ (కబడ్డీ )అయేషా భాను (అథ్లెటిక్స్, షాట్ పుట్ ) కిర్ల యశ్వంత్ ( foot బాల్ )లను సత్కారస్తున్నట్టు తెలిపారు.



**27 నుంచి ద్వి రాష్ట్ర క్రీడా, సాంస్కృతిక పోటీలు**

సీతమ్మ ధార ఎస్ ఎఫ్ ఎస్ స్కూల్ ప్రాంగణంలో 27వ తేదీ ఉదయం నుంచి తెలంగాణ, ఆంధ్ర రాష్ట్రాల ఎస్ ఎఫ్ ఎస్ స్కూల్ విద్యార్థుల 11 వ క్రీడా, సాంస్కృతిక పోటీలు ఘనంగా నిర్వహిస్తున్నామని మనోజ్ పేర్కొన్నారు. మూడు రోజులు పాటు ఉదయం క్రీడలు, సాయంత్రం ఏక పాత్రాభినయం, డాన్స్, పాటలు, ఫాన్సీ డ్రెస్, చిత్రలేఖనం, వ్యాసరచన వంటి పోటీలు ఉంటాయాన్నారు. 29వ తేదిన ప్రముఖులు చేతులు మీదుగా విజేతలకు బహుమతులు, ఛాంపియన్ షిప్ ట్రోఫీలు అందిస్తామని ఫాదర్ మనోజ్ తెలియ జేశారు.

## చిల్లర మాటలు బంద్ చేయాలి

- **రాజకీయాల్లో తిట్ల పురాణాన్ని ప్రారంభించిందే కేసీఆర్ అన్న చామల**
- **ముఖ్యమంత్రిని ఉద్దేశించి కేసీఆర్ 'తోలు తీస్తా' అంటే ఊరుకునేది లేదని హెచ్చరిక**
- **కేసీఆర్ పద్ధతిగా మాట్లాడితే రేవంత్ రెడ్డి అంతే పద్ధతిగా సమాధానం చెబుతారని వ్యాఖ్య**

**హైదరాబాద్, (సిద్దిపేట పవర్):**



ముఖ్యమంత్రి హోదాలో రేవంత్ రెడ్డి వాడుతున్న భాష సరిగాలేదని మాజీ మంత్రి, బీఆర్ఎస్ సీనియర్ ఎమ్మెల్యే హరీశ్ రావు చేసిన వ్యాఖ్యలపై భువనగిరి కాంగ్రెస్ ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి స్పందించారు. ఈ మేరకు ఆయన ఒక వీడియోను విడుదల చేశారు. రాజకీయాల్లో తిట్ల పురాణానికి ఆద్యుడు కేసీఆరేనని ఆయన పేర్కొన్నారు. రెండేళ్ల తర్వాత బయటకు వచ్చిన కేసీఆర్ ముఖ్యమంత్రిని ఉద్దేశించి 'తోలు తీస్తా' అంటే ఊరుకునేది లేదని హెచ్చరించారు.కేసీఆర్ పద్ధతిగా మాట్లాడితే రేవంత్ రెడ్డి అంతే పద్ధతిగా సమాధానం చెబుతారని, అభ్యంతరకర భాషను ఉపయోగిస్తే అదే పద్ధతిలో బదులిస్తారని అన్నారు. కేసీఆర్, కేటీఆర్‌లకు హరీశ్ రావు నీతులు చెప్పాలని ఎద్దేవా చేశారు. హరీశ్ రావు వ్యాఖ్యలు దెయ్యాలు వేదాలు వల్లించినట్లుగా ఉన్నాయని విమర్శించారు. నీతులు ఎదుటివారికే తప్ప తమకు కాదన్నట్లుగా మాట్లాడుతున్నారని అన్నారు. తొలుత కేసీఆర్ మాట్లాడే భాషను ఒకసారి పరిశీలించాలని సూచించారు. తెలంగాణ ఉద్యమం సమయంలో కేసీఆర్ తిట్ల పురాణం ప్రారంభించారని, కానీ ఇప్పుడు రాజకీయ నాయకుడిగా కూడా అదే భాషను కొనసాగిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేసీఆర్ అసెంబ్లీకి వచ్చి పదేళ్ల అవినీతిపై చర్చించాలని సవాల్ విసిరారు. కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ కూడా ముఖ్యమంత్రి, మాజీ ముఖ్యమంత్రికి గౌరవం ఇవ్వాలని సూచిస్తున్నారని, ఇదే విషయాన్ని బీఆర్ఎస్ నాయకులకు కూడా చెప్పాలని కోరారు.

## కేసీఆర్ కుటుంబం తెలంగాణకు శని

**మొదటిపేజీ తరువాయి**

ఆరోపించారు. ఈ అంశంపై మాట్లాడే నైతిక హక్కు కేసీఆర్‌కు లేదని స్పష్టంగా చెప్పారు. కృష్ణా జలాల పంపకాల్లో తెలంగాణకు జరిగిన నష్టానికి పూర్తిగా కేసీఆర్‌నే బాధ్యుడని వ్యాఖ్యానించారు. కృష్ణా నదీ జలాల పంపకాల్లో తెలంగాణకు రావాల్సిన వాటాను కేసీఆర్ తాకట్టు పెట్టారని బండి సంజయ్ ఆరోపించారు. ''కృష్ణా జలాల్లో తెలంగాణకు కేవలం 299 టీఎంసీలకే ఒప్పందం చేసుకున్నారు. 575 టీఎంసీల కోసం పోరాడాల్సిన సందర్భంలో కేసీఆర్ మౌనంగా ఉన్నారు. ముడుపుల కోసమే తెలంగాణ ప్రయోజనాలను తాకట్టు పెట్టారు'' అని విమర్శించారు. ఈ విషయాలను ఆధారాలతో సహా బయట పెట్టింది తానేనని చెప్పారు. ఏపీ మాజీ సీఎం జగన్‌తో ఏం ఒప్పందం జరిగిందో ప్రజలకు కేసీఆర్ చెప్పాలని డిమాండ్ చేశారు. అప్పట్లో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా ఉన్న సమయంలో తానే అపెక్స్ కౌన్సిల్ సమావేశం జరిపించానని బండి సంజయ్ గుర్తు చేశారు. కృష్ణా జలాల అంశంలో కేసీఆర్ పాత్ర పూర్తిగా ద్రోహపూరితమని అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టులో వెలుగులోకి వస్తున్న అక్రమాల నుంచి ప్రజల దృష్టి మళ్లించేందుకే కేసీఆర్ కృష్ణా జలాల అంశాన్ని లేవనెత్తుతున్నారని ఆరోపించారు. కాళేశ్వరం స్కాం నుంచి తప్పించుకునేందుకే కొత్త ఇష్యూ తీసుకొచ్చారని దుయ్యబట్టారు. కేసీఆర్ కుటుంబం మొత్తం తెలంగాణకు భారంగా మారిందని బండి సంజయ్ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ''కేసీఆర్ కుమారుడు కేటీఆర్ అహంకారంతో మాట్లాడుతున్నారు. కేసీఆర్ కుటుంబమే తెలంగాణకు పెద్ద శని. డబుల్ ఇంజిన్ సర్కార్‌తోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యం'' అని స్పష్టం చేశారు. ఇదే సమయంలో సీఎం రేవంత్‌రెడ్డి ఇటీవల కేసీఆర్‌పై చేసిన వ్యాఖ్యల్ని కూడా బండి సంజయ్ తప్పుబట్టారు. ''ఎవరి మీద విమర్శలు చేసినా మాటల తీరులో సంయమనం ఉండాలి. రేవంత్‌రెడ్డి మాట్లాడిన భాష సరైనది కాదు. ఇలాంటి మాటలు చివరకు ఆయన్నే నష్టపరుస్తాయి'' అని సూచించారు. హిందూ ధర్మం ప్రతి వ్యక్తి సుఖసంతోషాలతో ఉండాలని కోరుకుంటుందని తెలిపారు. గతంలో కేసీఆర్ అనుచితంగా మాట్లాడినప్పుడు తాము ఖండించామని, ఇప్పుడు సీఎం రేవంత్ కూడా తన మాటలపై పునరాలోచన చేసుకోవాలని సూచించారు.





## బిజెపి పార్టీ సుపరిపాలన దినోత్సవం లో బీజేపీ కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు సుజిత్ రెడ్డి

**తవణంపల్లి డిసెంబర్ 25(సిద్దిపేట పవర్)**

పూతలపట్టు నియోజకవర్గం తవణంపల్లి మండలం పల్లి చెరువు గ్రామంలో సుపరిపాలన దినోత్సవం ను బిజెపి కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షులు సుజిత్ రెడ్డి ఆధ్వర్యంలో అత్యంత ఘనంగా నిర్వహించారు. భారతీయ జనతా పార్టీ కీలక నేత మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్ పాయి శత జయంతి సందర్భంగా భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షులు పి.వి. యన్ మాధవ్, చిత్తూరు జిల్లా అధ్యక్షులు జగదీశ్వర నాయుడు పిలుపు మేరకు సుపరిపాలన దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా పల్లె చెరువు గ్రామంలో మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్ పాయి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు అనంతరం గ్రామంలోని వృద్ధులకు పండ్లు బ్రెడ్ పంచిపెట్టారు అలాగే గ్రామస్తులకు సీట్లు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో జిల్లా కిసాన్ మోర్చా అధ్యక్షులు సుజిత్ రెడ్డి మాట్లాడుతూ తాను జిల్లా అధ్యక్షులుగా పదవి చేపట్టిన తర్వాత మొట్టమొదట తన సొంత గ్రామం పల్లె చెరువులో కార్యక్రమాన్ని నిర్వహించడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్ష పదవి తనకు మరింత భాధ్యతను పెంచిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో బిజెపి మండల ప్రెసిడెంట్ కుమారి, పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు కె.వి చంద్ర మోహన్, నాయకులు వినాయక, అధిక సంఖ్యలో బిజెపి కార్యకర్తలు గ్రామస్తులు పాల్గొన్నారు.

## శాంతి, ప్రేమ సందేశంతో క్రిస్టమస్ వేడుకలు

- **ఫిరోజ్ గూడలో కేక్ కటింగ్ చేసిన బాలానగర్ కార్పొరేటర్ ఆవుల రవీందర్ రెడ్డి**

**కూకట్ పల్లి, డిసెంబర్ 25(సిద్దిపేట పవర్):**

కూకట్ పల్లి నియోజకవర్గం బాలానగర్ డివిజన్ పరిధిలోని ఫిరోజ్ గూడ ప్రాంతంలో ప్రతి సంవత్సరం క్రిస్టియన్ సోదరులు గురువారం క్రిస్టమస్ పర్వదినాన్ని పురస్కరించుకుని నిర్వహించే భారీ కేక్ కటింగ్ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బాలానగర్ డివిజన్ కార్పొరేటర్ ఆవుల రవీందర్ రెడ్డి పాల్గొని తన చేతుల మీదుగా కేక్ కట్ క్రైస్తవ సోదరులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ ఏసు ప్రభువు ఎల్లప్పుడూ శాంతి, ప్రేమ, ఐక్యతతో అందరూ కలిసిమెలిసి జీవించాలని సందేశం ఇచ్చిన గొప్ప దేవుడని పేర్కొన్నారు. సమాజంలో సోదరభావం మరింత బలపడాలని ఆకాంక్షించారు. అలాగే గతంలో కేసీఆర్ ప్రభుత్వం హయాంలో పేద క్రిష్టియన్ కుటుంబాలకు ప్రభుత్వం తరపున దుస్తుల పంపిణీ వంటి సంక్షేమ కార్యక్రమాలు చేపట్టేవారని గుర్తు చేశారు. కానీ ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఇప్పటివరకు క్రిస్టియన్ సోదరులకు ప్రభుత్వం తరఫున ఎటువంటి సహాయం అందడం లేదని ఆయన విమర్శించారు. ఈ కార్యక్రమంలో క్రిస్టియన్ సోదరులు, పాస్టర్ సామ్యూల్, నిర్వాహకులు రాజు, నాగరాజు స్థానిక నాయకులు, మందడి సుధాకర్ రెడ్డి, ఎడ్ల ప్రభాకర్, పంజా రామచంద్ర ముదిరాజ్, దేవులపల్లి కృష్ణమూర్తి, మల్ల రెడ్డి కాలనీవాసులు అధిక సంఖ్యలో పాల్గొని కార్పొరేటర్ కు కృతజ్ఞతలు తెలుపుతూ క్రిస్టమస్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు.



# స్కై ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఘనంగా క్రిస్మస్ వేడుకలు

**సికింద్రాబాద్, డిసెంబర్ 25 (సిద్ధిపేట పవర్):**



నగర పరిధిలో రోడ్ల పక్కన జీవనం సాగిస్తున్న సంచార జాతులు, నిరాశ్రయ కుటుంబాల చిన్నారులతో స్కై ఫౌండేషన్ గురువారం క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించింది. ఈ సందర్భంగా చిన్నారులకు బహుమతులు, ఆటవస్తువులు, వివిధ రకాల తినుబండారాలు అందజేసి క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేశారు. ఆటవస్తువులు, బహుమతులు అందుకోవడంతో చిన్నారులు అపారమైన ఆనందం వ్యక్తం చేయగా, తమ పిల్లల్లో సంతోషం నింపినందుకు తల్లిదండ్రులు స్కై ఫౌండేషన్‌కు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో స్కై ఫౌండేషన్ అధ్యక్షులు డాక్టర్ వై. సంజీవ కుమార్, వైస్ ప్రెసిడెంట్ ఓ. పావని పాల్గొన్నారు.

# టీడీఎఫ్ ఆధ్వర్యంలో కుట్టు శిక్షణ శిబిరం

- **శిక్షణ ఉత్తీర్ణులైన వారికి సర్టిఫికెట్లు అందజేత**

**సికింద్రాబాద్, డిసెంబర్ 25 ( సిద్ధిపేట పవర్ ):**




తెలంగాణ డెవలప్‌మెంట్ ఫోరం (టీడీఎఫ్) వనిత చేయూత ప్రాజెక్ట్‌లో భాగంగా తూప్రాన్ మహిళల కోసం నూతన ఉచిత కుట్టు శిక్షణ శిబిరాన్ని ప్రారంభించారు. ప్రభుత్వ రంగ సంస్థ సెట్విన్ ఆధ్వర్యంలో ఈ శిక్షణ అందిస్తున్నట్లు టీడీఎఫ్ ఇండియా అధ్యక్షులు మట్ట రాజేశ్వర్‌రెడ్డి తెలిపారు. గత మార్చిలో 60 మందికి శిక్షణ ఇవ్వగా, అందులో 23 మంది ఉత్తీర్ణులై సర్టిఫికెట్లు పొందినట్లు వనిత చేయూత అధ్యక్షురాలు టి.వాణి చెప్పారు. వనిత చేయూత ప్రాజెక్ట్ ద్వారా మహిళలు ఆర్థికంగా ఎదగాలన్నదే లక్ష్యమని టీడీఎఫ్ అమెరికా మాజీ అధ్యక్షురాలు కవిత చల్లా, డాక్టర్ దినేష్ రెడ్డి పేర్కొన్నారు. రానున్న రోజుల్లో ఈ కార్యక్రమాలను మరింత విస్తరిస్తామని వైస్ ప్రెసిడెంట్ పాటీ నరేందర్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో సెట్విన్ ప్రాజెక్ట్ మేనేజర్ అమీనా భాను, టీడీఎఫ్ ఇండియా, అమెరికా సభ్యులు, తూప్రాన్ మహిళలు, విద్యార్థులు, మున్సిపల్ అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# నిర్ణీత సమయంలో మేడారం మహా జాతర అభివృద్ధి పనులను పూర్తి చేయాలి.

- **భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా ఉండేందుకు ముందస్తు చర్యలు తీసుకోవాలి.**
- **జంపన్న వాగు వద్ద ఉన్న స్నాన ఘట్టాలు పరిశుభ్రంగా ఉంచాలి.**
- **రాష్ట్ర పంచాయతీ రాజ్ మంత్రి సీతక్క.**



**ములుగు,డిసెంబర్25(సిద్ధిపేట పవర్):**

నిర్ణీత సమయంలో మేడారం మహా జాతర అభివృద్ధి పనులను పూర్తి చేయాలని రాష్ట్ర పంచాయతీ రాజ్,గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా,మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క సూచించారు గురువారం ఎస్.ఎస్. తాడ్వాయి మండలంలోని మేడారంలో జరుగుతున్ శ్రీసమ్మక్క సారలమ్మ దేవాలయం అభివృద్ధి పనులను, పార్కింగ్ స్థలాలను, బస్టాండ్ ప్రాంగణంలో జరుగుతున్న పనులను,విఐపి,వివిఐపి రోడ్లను శ్రీరామ్ సాగర్ చెరువును రోడ్ల విస్తరణను జంపన్న వాగు దగ్గర ఉన్న స్నాన ఘట్టాలను రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా,మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క క్షేత్ర స్థాయిలో పరిశీలించారు.అనంతరం మంత్రి సీతక్క మేడారంలోని ఐటిడిఏ గెస్ట్ హౌస్ లో అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ జంపన్న వాగు పరిసరాలలో జరుగుతున్న పనులను వేగవంతం చేయాలని







# కుట్టు మిషన్ శిక్షణ పూర్తి సర్టిఫికెట్లు అందజేసిన మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీష్ రావు

**డిసెంబర్ 25 సిద్దిపేట పవర్**

నాసర్పురలో కుట్టు మిషన్ శిక్షణ పూర్తి చేసిన మహిళలకు సర్టిఫికెట్ల ప్రదానం సిద్దిపేట నియోజవర్గంలోని నాసర్పుర గ్రామంలో నిర్వహించిన కుట్టు మిషన్ (టైలరింగ్) శిక్షణ కార్యక్రమం విజయవంతంగా ముగిసింది. ఈ సందర్భంగా శిక్షణను పూర్తి చేసిన మహిళలకు వారి పేర్లతో కూడిన సర్టిఫికెట్లను అందజేశారు.ఈ కార్యక్రమంలో సిద్దిపేట ఎమ్మెల్యే హరీష్ రావు పాల్గొని మహిళలను అభినందించారు. అలాగే కార్యక్రమ ఇన్‌చార్జ్ దాచవరం రాజశేఖర్ రెడ్డి కూడా పాల్గొని శిక్షణార్థులకు ప్రోత్సాహం అందించారు. ఈ శిక్షణ ద్వారా మహిళలు స్వయం ఉపాధి సాధించి ఆర్థికంగా బలోపేతం కావాలని నిర్వాహకులు తెలిపారు.



# అమ్మాయిని దత్తత తీసుకున్న సామాజిక సేవకులు

**చేర్యాల, డిసెంబర్ 25 (సిద్దిపేట పవర్)**

చేర్యాల పట్టణానికి చెందిన అందే విజయ్ కుమార్ దంపతులు చేర్యాల మండలం నర్సాయపల్లి గ్రామానికి చెందిన లక్ష్మి ఇటీవల అనారోగ్యంతో మరణించింది.. వారికి ముగ్గురు సంతానం వారిలో పెద్ద కూతురు ఆరుసంవత్సరాలు..పిల్లలను పోషించడానికి తండ్రి కి ఇబ్బంది పడుతున్న తరుణంలో శ్రేష్టను చేర్యాల పట్టణానికి చెందిన సంఘ సేవకులు అమల విజయ్ కుమార్ గారు క్రిస్మస్ రోజున దత్తత తీసుకోవడం జరిగింది..ఈ సందర్భంగా విజయ్ కుమార్,అమల దంపతులను పలువురు అభినందించారు..



# చేర్యాల పోలీస్ స్టేషన్ లో క్రిస్మస్ వేడుకలు

**చేర్యాల, డిసెంబర్ 25 (సిద్దిపేట పవర్)**

చేర్యాల పోలీస్ స్టేషన్లో ఏసుక్రీస్తు పుట్టినరోజు సందర్భంగా ఏ ఎస్ ఐ వి .నవీన్ కుమార్ మరియు దళిత జర్నలిస్టుల ఫోరం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు కర్రోల్ల అన్నమ్మ నవజీవన్ తో కలిసి క్రిస్మస్ కేక్ కట్ చేయడం జరిగినది. ఏఎస్ఐ నవీన్ కుమార్ మాట్లాడుతూ ఏసుప్రభు చూపిన కరుణ, దయ మార్గము మానవాళికి ఆదర్శమన్నారు. సమాజంలో శాంతి సామరస్యాలు వెల్లివిరి యాలని, ప్రతి ఒక్కరు తోటి వారికి సహాయము చేసే గుణాన్ని అలవర్చుకోవాలని సూచించారు. తమ మతాన్ని ఆరాధిస్తూనే ఇతర మతాలను గౌరవించాలని ఏఎస్ఐ నవీన్ కుమార్ అన్నారు. ఈ కార్యక్రమంలో కర్రోల్ల చరణ్, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

